# కల్వరి ప్రేమధార

(ఆధ్యాత్మిక త్రైమాస పత్రిక)




## యేసుక్రీస్తు

నిన్న, నేడు,
ఒక్కటేరీతిగా ఉన్నాడు

(హెబ్రీ 13:8)


అక్టోబర్-నవంబర్-డిసెంబర్ 2026
విడి ప్రతి వెల రూ : 50/-



ఎడిటర్:
Dr.యన్. జయపాల్





MEANINGFUL
Christmas
AND A BLESSED
NEW YEAR
2027
GOD'S FAITHFULNESS
CONTINUES
Joy
Hope
Peace
Always
FOR
UNTO US A
Child
is born,
UNTO US A
Son
is given; and the government
will be upon his shoulder, and
his name will be called
Wonderful Counselor
MIGHTY GOD
Everlasting Father
PRINCE OF PEACE.
ISAIAH 9:6
CALVARY CHURCH CHENNAI
TO GOD BE THE GLORY

# కల్వరి ప్రేమధార

## ఆధ్యాత్మిక త్రైమాసిక పత్రిక

కల్వరి - 41 ధార - 4

ఈ పత్రిక ఉచితం కాదు, కనీస వార్షిక విరాళము రూ.300/-

ఎడిటర్ : యన్ .జయపాల్

అక్టోబర్-నవంబర్ -డిసెంబర్ 26

## ముఖాముఖి

ప్రభువు నందు ప్రియులైన కల్వరి ప్రేమధార పాఠకులకు శుభమని చెప్పి వ్రాయుట!

ఈ డిజిటల్ మీడియా కాలములో కూడా మీరు కల్వరి ప్రేమధార పత్రిక కొరకు ఎదురుచూస్తున్నాం, చదువుతున్నాం, ధ్యానిస్తున్నాం అని తెలియజేయుట మాకెంతో ప్రోత్సాహాన్ని కలిగిస్తున్నది.

ఇంటర్నెట్, యూట్యూబ్ , ఫేస్ బుక్ వంటివి రాకముందు 50 వేల పత్రికలు ప్రింట్ చేసేవారిమి, ఇప్పుడు 15 వేల పత్రికలకు కుదించవలసి వచ్చినది. AI (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కాలములో మనుష్యులు Google, ChatGPT వంటి వాటి మీద ఆధారపడుచు దేవుని వాక్యమును ప్రింట్ మీడియాను ప్రక్కన పెట్టుచున్నారు. బైబిల్ ను చదువుట మాని AI మీద ఆధారపడుతున్నారు. భవిష్యత్తులో ఇది ఎంత అపాయకరమైనదని గుర్తించలేకపోవుచున్నారు.

మీ చేతిలో ఉన్న ప్రింటెడ్ బైబిల్ ను ఎవరు మార్చలేరు గాని డిజిటల్ బైబిల్ ను ఇప్పుడు ధ్యానించుటకు AI ద్వారా అనేక రకాల మార్పులు తెచ్చుటకు ప్రయత్నిస్తున్నారు. ఇట్టి బైబిల్ ను ఎవరి ఇష్టానుసారంగా వారు మార్చుకొంటున్నారు.

ఇంటర్నెట్ ద్వారా ప్రపంచములో ఎక్కడ ఏది జరిగినా క్షణములో తెలుసుకోగలుగుచున్నాము జనులు నలుదిశల సంచరించి నందున తెలివి అధికమగును (దానియేలు 12:4). అయితే ఈ తెలివి పైనుండి దిగివచ్చునది కాక భూసంబంధమైనదని, ప్రకృతి సంబంధమైనదని, దయ్యముల జ్ఞానము వంటిదని గుర్తించలేకపోవుచున్నారు (యాకోబు 3:15).

Gen z యువతను గురించి మనం వింటున్నాము అంటే 13-39 వయస్సు గలవారు. ఈ తరమువారు ఎలక్ట్రానిక్ మీడియా మీద ఆధారపడుతూ, వేగముగా ఏదో సాధిస్తున్నామని ఉరకలువేస్తున్నారు. ఇప్పుడు AI ఉపయోగం ఇంకా అధికముగా ఉన్నందున ఏది కావాలన్నా గూగుల్, ChatGPT,Cloud వంటి app లను అనుసరిస్తూ నీచకార్యములు, విరోధములు, అల్లరి మత్సరములకు చోటిచ్చి; కృత్రిమమైన వాటిని కలుగజేసుకొనుచు, ఒకరిపైన ఒకరు హెచ్చించుకొనుచు అధోగతికి దిగజారిపోవుచున్నారు.

ఇక ఈ Gen Alpha అనగా 2025-2039 మధ్య జన్మించు వారు, రాబోవు తరముల వారు ఎలా తయారవుతారో ఊహించవచ్చు. AI ద్వారా నిజమైనది ఏదో, నకిలీదేదో తెలియని పరిస్థితిలో ఇరుక్కొంటున్నారు. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు, సేవకులు కంటె మేమే మేధావులమని టెక్నాలజీ మీద ఆధారపడుతున్నారు. Internet ఆగిపోతే వారి బ్రతుకులే నిలిచిపోతాయని, AI సృష్టిస్తున్న నకిలీ అంతటికీ ఒక ముగింపు ఉందని; ప్రభువు రాకడ, పంచభూతములు మహావేండ్రముతో లయమైపోయే కాలం సమీపింయున్నదని గ్రహించుట లేదు. అణుబాంబులు,మిస్సైల్స్, రోబోట్స్ ను బట్టి అతిశయిస్తున్నారు గాని అవన్నీ నాశనము, ప్రాణహాని కలుగజేసేవని గుర్తించుట లేదు.

సర్వసృష్టి కర్త, సర్వాధికారియైన ప్రభువైన యేసు క్రీస్తును, ఆయన ప్రేమను, ఆయన చేసిన సిలువ యాగమును గ్రహించుట లేదు. అపవాది ఈ టెక్నాలజీని వాడి, అనేకులను నాశనము చేయుచున్న ఈ అంత్యదినములలో మనము ఇదే టెక్నాలజీని వాడి; నేనే మార్గం, సత్యం, జీవం అన్న ప్రభువు శక్తిని, ప్రేమను ప్రకటిద్దాం రండి, ప్రార్థించండి!

ఎడిటర్: ఎన్. జయపాల్

ఈ సంచికలో:

★ మీరు ఏ తరము వారు
★ GEN –Z ప్రత్యేకత ఏమిటంటే
★ సంఘ ప్రార్థన
★ ధన్యజీవి అన్న
★ నీవు అధికారివా? అనాయకుడివా?
★ స్తుతి కలిగిన హృదయం
★ మేలు చేత కీడును జయించు
★ రక్షణ వాయిదా వేయకు
★ మిత్రమా నువ్వు ఫలిస్తున్నావా?

ఇంకా ఎన్నోమరెన్నో

CALVARY CHURCH CHENNAI
TOGETHER WE REACH LIVES
Phone: 044-22434787
Cell: (0) 9884707779 | (0) 8939393939
Email: Enquiry@Jayapaul.com
Website: WWW.JAYAPAUL.ORG




మీకు తెలుసా ?

# మీరు ఏ తరము వారు ?

మా దినములు లెక్కించుటకు మాకు నేర్పుము - కీర్తన 90:12

తరాల అవగాహన మరియు జనసమూహముల వారీగా 2026 నాటికి జీవించి ఉన్న జనాభా!

| # | తరం | జనన సంవత్సరాలు | వయసు / స్థితి | ప్రపంచం | భారత్ | లక్షణం / గుర్తింపు | ప్రతినిధి వ్యక్తులు |
|---|---|---|---|---|---|---|---|
| 1 | లోస్ట్ జనరేషన్ | 1883 – 1900 | వయసు 125+ (మహా మార్పుల కాలములో జన్మించారు) | < 0.01M | < 0.001M | కొత్త యుగ నిర్మాతలు |  |
| 2 | గ్రేటెస్ట్ జనరేషన్ | 1901 – 1927 | వయసు 98 - 124 (యుద్ధములను అనుభవించి, ఆధునికి ప్రపంచ నిర్మాణములో భాగస్వాములు) | ~ 1.7M | ~ 0.11M | ధైర్యవంతులు సహనశీలులు |  |
| 3 | సైలెంట్ జనరేషన్ | 1928 – 1945 | వయసు 80 - 97 (క్రమశిక్షణ, నిజాయితీ, కష్టపడే స్వభావం) | ~ 153M | ~ 14.7M | స్థిరమైన నమ్మకమైన |  |
| 4 | బేబీ బూమెర్స్ | 1946 – 1964 | వయసు 61 - 79 (యుద్ధానంతర వృద్ధి మరియు అవకాశాలు) | ~ 953M | ~ 130.8M | ఉత్సాహవంతులు ఆశావాధులు |  |
| 5 | జనరేషన్ ఎక్స్ | 1965 – 1980 | వయసు 45 - 60 (స్వతంత్ర మరియు అనుకూలత) | ~ 1.44B | ~ 240M | స్వతంత్రులు సామర్థ్యావంతులు |  |
| 6 | మిల్లీనియల్స్ | 1981 – 1996 | వయసు 29 - 44 (సాంకేతిక పరిజ్ఞానం లక్ష్య సాధన దిశగా) | ~ 1.85B | ~ 358M | సృజనాత్మకులు లక్షసాధకులు |  |
| 7 | జనరేషన్ జెడ్ | 1997 – 2012 | వయసు 13 - 28 (డిజిటల్ తరం సామాజిక అవగాహన కలిగి) | ~ 2.04B | ~ 406M | ధైర్యవంతులు సామాజికంగా సజాగ్రత్త |  |
| 8 | జనరేషన్ ఆల్ఫా | 2013 – 2024 | వయసు 2 - 12 (డిజిటల్ ప్రపంచములో పెరుగుతున్నవారు) | ~ 1.73B | ~ 304M | ఆసక్తి గల టెక్నాలజీ తెలివైన |  |
| 9 | జనరేషన్ బీటా | 2025 – 2039 | ఇంకా జన్మించలేదు- భవిష్యత్తు తరం (AI మరియు ఆధునిక సాంకేతికతతో పెరుగుతోంది) | ~ 257M | ~ 45M | భవిష్యత్తు ఇప్పుడే ప్రారంభమవుతుంది |  |
| 10 | జనరేషన్ గామా | 2040 – 2054 | భవిష్యత్తు తరం (ఇంకా అభివృద్ధి చెందిన, అనుసంధానమైన ప్రపంచాన్ని అనుభవిస్తుంది) | 0 | 0 | మరింత ప్రకాశవంతమైన రేపు |  |

- ఎన్. జయపాల్

యవ్వనులకు:

# GEN-Z ప్రత్యేకత ఏమిటంటే ?

GEN-Z ప్రత్యేకత ఏమిటంటే, ఇంచుమించు 13 సంవత్సరాల నుండి 28 సంవత్సరాల వయస్సు కలిగినవారు. వీరందరూ 1997 తర్వాత జన్మించినవారు.వీరు ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా, స్ట్రీమింగ్ వీడియో, ఇన్‌స్టంట్ డిజిటల్ మీడియా సంభాషణ తో పెరుగుతున్నవారు గనుక ఇవన్నీ వీరికి సర్వసాధారణమైపోయాయి.

వీరికి Google,YouTube,ChatGPT వంటి వాటి ద్వారానే లోకజ్ఞానాన్ని సంపాదించుకొని,అనుభవజ్ఞానం లేనివారిగా అవుతున్నారు. అయితే వీరికి ఆన్‌లైన్ షాపింగ్, ఆన్‌లైన్ స్ట్రీమింగ్, వీడియో కాల్స్ సర్వసాధారణమైనవి. నేటి యువత YouTube Shorts Instagram Reels వంటి వాటి తో కాలక్షేపం చేస్తూ,సోషల్ మీడియాను సంభాషణ కు అతిగా ఉపయోగిస్తున్నారు.వీరు ఎన్నో చూస్తూ,ఎన్నో చేస్తున్నప్పటికీ,దేనినీ గురిపెట్టి మనసు పెట్టి చేయలేకపోతున్నారు.



ఇంతకు ముందు వలె టీచర్లు, తల్లిదండ్రులు, డాక్టర్లు, పాస్టర్లు అవసరం లేకుండానే వారికి కావాల్సిన సమాచారాన్ని వెంటనే ఆన్‌లైన్ ద్వారా తెలుసుకుంటున్నారు.ఇప్పుడు ఇంకా AI ద్వారా కృత్రిమాలను కల్పించుకుంటూ తృప్తి చెందుతున్నారు.




పూర్తిగా లేటెస్ట్ టెక్నాలజీకి అలవాటుపడిన ఈనాటి యువతను ప్రభువు కొరకు సంపాదించుటకు "బలహీనులకు బలహీనుడనైతిని;ఏవిధము చేతనైనను కొందరిని రక్షింప వలెనని అందరికి అన్నివిధముల వాడనైయున్నాను" (I కొరింథీయులకు 9:22) అన్న పౌలు వలె ఈ తరానికి సువార్తను అందించాలి.



సువార్త సారం మారకుండా, డిజిటల్ మీడియా ద్వారా వారికి అందించే విధానాన్ని మనం మార్చుకోవాలి. గతకాలం వలె వీధి పరిచర్య, ఇంటింట పరిచర్య, కరపత్రాల పంపిణీ పరిచర్య కంటే, ఈ రోజు అందుబాటులో ఉన్న సోషల్ మీడియా ద్వారా సువార్తను ప్రతి ఒక్కరికీ అందించాలి;అన్న ఆ గురితోనే ఇంతవరకు పలు విధములుగా సువార్తను బహిరంగంగాను, రేడియో, టీవీ, వాఙ్మయం ద్వారా అందించడంతో పాటు, GEN-Z జనరేషన్‌కు సంపూర్ణ సువార్తను అందించాలని Facebook, YouTube, Instagram, Twitter, Mobile App, Website, Live Telecasting ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 2 బిలియన్ల కంటే ఎక్కువగా ఉన్న ఈ తరానికి, వీలైనన్ని భాషలలో ప్రభువు నామంలోని శక్తిని, ప్రేమను అందించుటకు ప్రయాసపడుతున్నాము.



60 సంవత్సరాల వయస్సు దాటిన Baby Boomers అనేకులు ఉన్నారు గనుక, వారికి అవసరమైన ఆధ్యాత్మిక పెరుగుదలను ఇచ్చే పరిచర్యను కొనసాగిస్తున్నాము.అలాగే 30 సంవత్సరాల వయస్సు వరకు ఉన్న Generation X మరియు 29 సంవత్సరాల వయస్సు దాటిన Generation Y వారిని కూడా ఆధ్యాత్మికంగా బలపరచుటకు,రక్షణలోనికి నడిపించుటకు ,Get-togethers,Conferences,స్త్రీల మీటింగ్‌లు కొనసాగిస్తున్నాము.

వాటిని మానక వీటిని చేయవలసియుండెను (మత్తయి 23:23) అన్న ప్రభువు చెప్పినట్లుగా, అన్ని విధములుగా క్రీస్తు మరణం, సిలువ, పునరుత్థానములను ప్రకటిస్తూ, అంతటా అందరూ మారుమనస్సు పొందవలెనని ప్రార్థిస్తున్నాము,మీరును ప్రార్థించండి.

-✍ ఎడిటర్

బైబిలు పఠనం :

# యోహాను సువార్త

గ్రంథకర్త : యోహాను

కాలము : క్రీ.శ. 60-90

అధ్యాయములు : 21

ముఖ్యాంశము : దేవుని కుమారుడుగా ఉన్న యేసుప్రభువు

వచనములు : 879

ముఖ్య వచనములు : 1:11-13; 20:30,31

జెబెదయి, సలోమేయను ధన్య దంపతుల కుమారుడును, బేత్సయిదా నివాసియునైన యోహాను దీని గ్రంథకర్త! అతడు తనను 'యేసు ప్రేమించిన శిష్యుడు' అని పేర్కొని, ప్రభువు ప్రేమపై ఆధారపడిన పరమార్థ జ్ఞాని! ఈ గ్రంథమునకు మూల పదమైన 'విశ్వసించు' అను మాట 98 సార్లు కలదు. అయితే విశ్వసించవలసిన దేమనగా, 'యేసుక్రీస్తు దేవుని కుమారుడని'. ఆయన దైవత్వమును నిరూపించుట ఈ గ్రంథ ముఖ్య ఉద్దేశ్యము! బేత్లెహేము పశువుల తొట్టిలో పరుండినవాడే సమస్తమును సృష్టించినవాడు. ఆయనే పరమ దేవుడైయుండి, దేవుని కుమారుడుగా కృపాసత్యముల సంపూర్ణతను తన శరీరమందు ఇముడ్చుకొని, మనుష్యుల మధ్య నివాసమేర్పరచుకొనెను.

'నేనే' అని ప్రభువు చేసిన ఏడు ఉద్ఘాటనలు ఆయన దైవత్వమును స్థాపించు చున్నవి. 'ఆయనను నేనే' (18:5) అని ప్రభువైన యేసు చేసిన ప్రకటన నిర్గమ కాండము 3:14లోని 'నేను ఉన్నవాడను' అనిన యెహోవా దేవుని ప్రకటనకు సమానము! కనుక యేసే యెహోవా. 'జీవాహారము నేనే' (3:35); 'నేను లోకమునకు వెలుగును' (8:12); 'ద్వారమును నేనే' (10:7); 'నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని' (10:11); 'పునరుత్థానమును జీవమును నేనే' (11:25); 'నేనే మార్గమును సత్యమును జీవమును' (14:6); 'నేను నిజమైన ద్రాక్షావల్లిని' (15:1). ఇవన్నియు సాటిలేని దైవత్వపు మేటి నిరూపణలు! ఇందులోని సూచక క్రియలన్నియు ప్రభువు మాటతో జరిగినవే! అవును, ఆయనది మహత్తు గల మాట (హెబ్రీ 1:3).

యోహాను సువార్తలో ఏడు అద్భుత కార్యములు మినహా మరే ఉపమానాలు లేవు. అవి: 1. నీరును ద్రాక్షారసముగా మార్చుట, 2. ఒక ప్రధాని కుమారుని స్వస్థపరచుట, 3. దీర్ఘకాల రోగిని స్వస్థపరచుట, 4. ఐదువేల మందికి ఆహార మిచ్చుట, 5. నీటిపై నడచుట, 6. పుట్టు గ్రుడ్డివానిని స్వస్థపరచుట, 7. చనిపోయిన లాజరును బ్రతికించుట. ఈ ఏడింట్లో రెండు మహత్కార్యములు మాత్రమే మిగిలిన సువార్తల్లో ప్రస్తావించబడినవి. ఈ సువార్తలో విశ్వాసము, జీవము ప్రధాన ఉద్దేశ్య ములుగా వ్రాయబడినవి.

యోహాను వ్రాసిన సువార్త ప్రభువును మనము విశ్వసింపవలెననియు, యోహాను వ్రాసిన మూడు పత్రికలు ఆయనను మనము ప్రేమించవలెననియు, యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము ఆయన కొరకు మనము ఎదురుచూడవలసియున్నదనియు తెలుపుచున్నవి.

- ఎస్. జయపాల్

# సంఘ ప్రార్థన

దేవుని ప్రజలు సంఘముగా కూడి ప్రార్థించాలి! పాత నిబంధనలో ఇశ్రాయేలు జనాంగాన్ని 'సంఘం' అని పిలువలేదు గాని, 'సమాజం' అని పిలిచారు. ఈ సమాజాన్ని ఐగుప్తు బానిసత్వములో నుండి విడిపించి, పాలుతేనెలు ప్రవహించు కనాను దేశానికి నడిపించుటకు దేవుడు మోషేను నాయకుడుగా వాడుకొన్నాడు.ఒకసారి ఇశ్రాయేలీయులు అరణ్య ప్రయాణములో అమాలేకీయులతో యుద్ధం చేయవలసి వచ్చింది. ఆ సమయంలో మోషే చేతులెత్తినప్పుడు ఇశ్రాయేలీయులకు జయం కలిగేది, మోషే చేతులు బరువెక్కి క్రిందికి దిగిపోతున్నప్పుడు అమాలేకీయులు గెలిచేవారు.

ఈ విషయాన్ని అక్కడే ఉండి గుర్తించిన అహరోను, హూరులు మోషే చేతులు బరువెక్కి దిగిపోతున్న సమయంలో మోషేను ఒకచోట కూర్చుండబెట్టి వారిద్దరు చెరొకవైపున ఉండి మోషే చేతులను పట్టుకొన్నారు.కాబట్టి ఇశ్రాయేలీయులు పూర్తి విజయాన్ని సాధించారు, మోషే చేతులెత్తుట ప్రార్థనకు గుర్తుగా ఉన్నది. అహరోను యాజకులకు, హూరు సంఘ పెద్దలకు గుర్తుగా ఉన్నారు.

ఈనాడు కూడా దైవజనులు ప్రార్థించాలి! సంఘములోని సేవకులు, పెద్దలు అందరూ కలిసి ఏకీభవించి ప్రార్థించాలి!అప్పుడే దేవుని గొప్ప కార్యాలను చూస్తాం! పేతురు చెరసాలలో ఉన్నప్పుడు సంఘమంతా ఆసక్తితో ప్రార్థించెను. ఆది సంఘము ఏక హృదయ ముతో, ఏకాత్మతో ప్రార్థించింది! అందుకే అద్భుతాలు జరిగాయి, ఆత్మలు రక్షించబడ్డాయి!

ఈనాడు లోకమంతటికీ సువార్త అందించటానికి, సాతాను కోటలు పడగొట్ట టానికి ప్రార్థన ఎంతో అవసరం! సంఘం ప్రార్థించాలి! అంటే సంఘములోని సేవకులు, నాయకులు, పెద్దలు, పిల్లలు, విశ్వాసులు అందరూ కలిసి ప్రార్థించాలి! అప్పుడే స్వస్థతలు కలుగుతాయి, దయ్యములు పారద్రోలబడతాయి, అద్భుతములు జరుగుతాయి, ఆత్మలు రక్షించబడతాయి!

కాబట్టి "కొందరు మానుకొనుచున్నట్టుగా, సమాజముగా కూడుట మానక, ఒకనినొకడు హెచ్చరించుచు,ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా అలాగు చేయుచు, ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము" (హెబ్రీ 10:24-25) - ఎడిటర్

**ప్రార్థనా జీవితానికి అవసరమైన పుస్తకములు**

1 ప్రభువా ప్రార్థన నేర్పుము 2. ప్రియుడా ప్రార్థించు,

3 ఉపవాస ప్రార్థనా శక్తి రహస్యం అనే ఈ పుస్తకములను పొందుటకు

విరాళము రూ: **200/-** | G Pay पे 9100100888



వృద్ధులకు:

# ధన్యజీవి అన్న



అన్న అను ఒక ప్రవక్త్రి యుండెను యెనుబది నాలుగు సంవత్సరములు విధవరాలైయుండి,దేవాలయము విడువక ఉపవాస ప్రార్థనలతో రేయింబగళ్లు సేవచేయుచుండెను. లూకా **2:36,37**

అన్న అనగా 'కృప' లేక 'దయ' అని అర్థము! ఈమె యేసుక్రీస్తు పుట్టినప్పుడు యెరూషలేములో ఉండిన ప్రవక్తి. వివాహమైన 7 సంవత్సరములకే విధవ రాలాయెను. అప్పటి నుండి దేవాలయము విడువక 84 సంవత్సరములు ఉపవాస ప్రార్థనలతో రేయింబగళ్ళు సేవ చేయు చుండెను. తన వైధవ్యాన్ని బట్టి కృంగిపోలేదు గాని, దేవుని సన్నిధిలో ఆదరణ పొందెను. ప్రార్థించుటకు తన జీవితమును సమర్పించుకొనెను.

ఈమె ఎందు కొరకు ప్రార్థించుచుండెను? మెస్సీయ రాక కొరకు! ఆ దినము లలో ఆలయము ఆచార సంబంధమైన భక్తితోను, అక్రమముతోను నిండియుండెను. గొట్టెల యొక్క, ఎడ్ల యొక్క రక్తము చేత మానవులు తమ పాపముల నుండి సంపూర్ణ విమోచన పొందలేక కొట్టుమిట్టాడుచు యుండిరి. అట్టి సమయములో ప్రవచనముల నెరవేర్పు కొరకు ఈమె ప్రార్థించుచూ యుండెను. ఓపికతో, విశ్వాసముతో 84 సంవత్సరములు ప్రార్థించెను.

అంతేకాదు, ఆమె రక్షకుని కనుగొని యెరూషలేములో విమోచన కొరకు కనిపెట్టువారందరికి ఆయన గురించి చెప్పెను. మనలో ఇటువంటి ప్రార్థన యున్నదా? మెస్సీయ వచ్చి సుమారు రెండువేల సంవత్సరములు అగుచున్నది. ఈ సువార్త అందవలెనని నీవు ఉపవాస ప్రార్థనలు చేస్తున్నావా? రేయింబగళ్ళు ఆత్మల రక్షణార్థమై పరిచర్య చేయుచున్నావా?

ఎన్నో క్రిస్మస్ పండుగలను, నూతన సంవత్సర తీర్మానములను చేయుచున్న ఓ క్రైస్తవుడా! ఈ రక్షకుడైన క్రీస్తును నీ రక్షకునిగా చేసుకొని రక్షణ కొరకై తబ్బిబ్బు లాడుచున్న మన దేశస్థులకు ఆయన రక్షణ సువార్తను ప్రకటించావా?

అన్న శతవృద్ధ అయియుండియు ఉపవాస ప్రార్థనలు చేయుచు, రేయింబగళ్ళు సేవ చేయుచు, విమోచన కొరకు కనిపెట్టు వారందరితో ఆయన గురించి మాటలాడుచుండెను. ఆమె ఎంత ధన్యజీవి!

- ఎస్. జయపాల్

## మరి నీవు?

స్వీయ పరీక్షా

# నీవు అధికారివా? నాయకుడివా?






| | అధికారి | నాయకుడు |
|---|---|---|
| 1. | అధికారి ఇతరులను ఆదేశిస్తాడు | నాయకుడు ఇతరులను ప్రభావితం చేస్తాడు |
| 2. | అధికారి తన అధికారం చెలాయించి పని జరిపిస్తాడు | నాయకుడు తన పరపతితో సమ్మతింప జేస్తాడు |
| 3. | అధికారి భయాన్ని పుట్టిస్తాడు | నాయకుడు ప్రేమను ఉద్భవింపజేస్తాడు |
| 4. | అధికారి 'నేను' అంటాడు | నాయకుడు 'మనము' అంటాడు |
| 5. | అధికారి ఎవరిది తప్పో చూపిస్తాడు | నాయకుడు తప్పు ఎక్కడుందో చూపిస్తాడు |
| 6. | అధికారి గౌరవించబడాలని కోరుకుంటాడు | నాయకుడు ప్రేమ ద్వారా గౌరవము పొందుతాడు |
| 7. | అధికారి పనిని భారమైన బానిస వృత్తిగా చేస్తాడు | నాయకుడు పనియందు ఆనందింప చేస్తాడు |
| 8. | అధికారి కుర్చీలో కూర్చొని పెత్తనం చేస్తాడు | నాయకుడు ముందు నడుస్తూ ఇతరులను నడిపిస్తాడు |
| 9. | అధికారి డబ్బు ద్వారా, జ్ఞానంద్వారా అధికారం సంపాదిస్తాడు | నాయకుడు పరిచర్య ద్వారా, అనుభవం ద్వారా నాయకుడు అవుతాడు |
| 10. | అధికారి ఇతరులకు దొరకకుండునట్లు అందలం ఎక్కి కూర్చొంటాడు | నాయకుడు అందరికి అందుబాటులోఉంటాడు |
| 11. | అధికారి తన సామర్థ్యాన్ని ఇతరులపై రుద్దుతాడు | నాయకుడు ఇతరుల సామర్థ్యముతో కలిసి పని చేస్తాడు |
| 12. | అధికారి ఇతరులను హీనపరుస్తాడు | నాయకుడు తోటివారిని గౌరవిస్తాడు |
| 13. | అధికారి ఇతరులను పనివారిగా భావిస్తాడు | నాయకుడు ఇతరులను తనవారిగా ఎంచుతాడు |
| 14. | అధికారి అధికారే | మంచి నాయకుడు మంచి సేవకుడు కూడా! |
| 15. | అధికారిగా పరో ఇశ్రాయేల ప్రజలను ఉపయోగించుకొని బానిసలుగా చేసాడు | నాయకునిగా మోషే దేవుని శక్తితో ఇశ్రాయేలీయులను విడిపించి స్వతంత్రులుగా చేసాడు |

## మరి మీరు అధికారిగా ఉన్నారా? నాయకునిగా ఉన్నారా?

"బలిమి చేత కాక దేవుని చిత్త ప్రకారము ఇష్ట పూర్వకముగాను, దుర్ధాభాపేక్షతో కాక సిద్ధ మనస్సుతోను మీ మధ్యనున్న దేవుని మందను పైవిచారణ చేయుచు దానిని కాయుడి. మీకు అప్పగింప బడినవారిపైన ప్రభువులైనట్లుండక మందకు మాదిరులుగా ఉండుడి" (I పేతురు 5 : 2,3) అని బైబిలు చెప్పుచున్నది.

-ఎడిటర్

విశ్వాసులకు:

# స్తుతి కలిగిన హృదయము

"నా నోటితో నేను యెహోవాకు కృతజ్ఞతా స్తుతులు మెండుగా చెల్లించెదను. అనేకుల మధ్యను నేను ఆయనను స్తుతించెదను"

(కీర్తన 109:30)

దావీదు చిన్న వయసులోనే గొఱ్ఱెలు మేపుచు దేవుని స్తుతించుట,కీర్తించుట నేర్చుకొనెను. దావీదు జీవితమంతయు స్తుతితో నిండియుండెను.దేవుని స్తుతించుట ఎన్నడు మరువలేదు. "నా ప్రాణమా యెహోవాను సన్నుతించుము ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరువకుము" అనేది ఆయన కీర్తన ఆయన తన నోటితోను, సితారాతోను మాత్రమేగాక తన హృదయమంతటి తో దేవునిని స్తుతించెను.సకల ప్రాణులు యెహోవాను స్తుతించుడి అని 150 వ కీర్తన వ్రాసి పాడెను.

దేవుడు ఎల్లప్పుడు స్తుతికి పాత్రుడు. నీ జీవితములో ఇటువంటి స్తుతి యున్నదా? ఆయన చేసిన ఉపకారముల కొరకు ఆయనను స్తుతించుచున్నావా? దేవుని స్తుతించేవారు ఆరోగ్యవంతులై యుంటారు.దేవుని స్తుతించువారి యొద్దకు సాతానుడు రాలేడు. దావీదు స్తుతికీర్తనలు పాడుచున్నప్పుడు సౌలులోని దురాత్మ పారిపోయెడిది (I సమూయేలు 16:23). చూడండి కష్ట నష్టములలో కూడా దేవుని స్తుతించుచున్న యోబును సైతాను ఏమియు చేయలేకపోయెను.

నీకు ఏమైనా కావలయునంటే దేవునిని అడుగు గాని, మొదట దేవుడు నీకిచ్చిన వాటికై ఆయనను స్తుతించుము. నీ హృదయములో స్తుతి లేకపోతే సణుగుడు ప్రవేశించును. మీరు సణుగవద్దు, సణిగినందున ఇశ్రాయేలీయులు అనేకులు అరణ్యములో కూలిరి (I కొరింథీ 10:10) అని దేవుని వాక్యము తెలియజేయుచున్నది. సణిగేవారి యొద్దకు సైతాను వచ్చి కూర్చొనును.

"ఎల్లప్పుడూ ప్రతి విషయములోను దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి" (థెస్స 5:16) అని పౌలు వ్రాయుచున్నాడు. మనలను సృష్టించిన, మన కొరకు రక్తమును చిందించిన, మన ప్రభువైన యేసుక్రీస్తు స్తుతికి పాత్రుడు. ప్రభువా! స్తుతించుట నేర్పుము అని ప్రార్థించుము.

ఎందుకంటే "స్తుతి యాగము అర్పించువాడు నన్ను మహిమపరచు చున్నాడు. నేను వానికి దేవుని రక్షణ కనుపరచునట్లు వాడు మార్గము సిద్ధపరచుకొనెను" (కీర్తన 50:23) అని వ్రాయబడియున్నది.స్తుతికి పాత్రుడైన మన ప్రభువును ఎల్లప్పుడు స్తుతించెదము గాక!

- యన్. జయపాల్

పాఠం:

# మేలు చేత కీడు జయించు!

ఆఫ్రికా దేశమందు ఆత్మల భారం కలిగిన ఒక సేవకుడు పరిచర్య చేస్తుండేవాడు! దేవుని ప్రేమ ఎరుగని ప్రజలకు ప్రభువు ప్రేమను ప్రకటిస్తుంటే, ఆ ఊరి పెద్ద అభ్యంతరపరచి- 'ఇక్కడ యేసు ప్రభువు గూర్చి తెలియపరిస్తే నిన్ను చంపేస్తాను' అని బెదిరించాడు. అయినా వారి అనాగరికతను చూసి; ఆ చీకటి ఖండములో చీకటి ప్రజలకు సువార్తను అందించాలనే ఆశతో 'నీ వాక్కుతో వెలుగును సృజించిన తండ్రీ, ఈ జనుల మధ్య ఉన్న చీకటి శక్తులను, పాపమును పారద్రోలుము అని ప్రార్థిస్తూ, ప్రభువు ప్రేమను ప్రకటిస్తూ ఉండగా; ఒక దినమున ఆ ఊరి పెద్ద ఈ సేవకుని చంపేసాడు!





అయితే ఒక రోజు చనిపోయిన ఆ సేవకుని కుమారుడు తన తండ్రి ధరించిన కోట్లు, వస్త్రాలు తీసుకొని; గుఱ్ఱముపై ప్రయాణించి ఆ నాయకుని యొద్దకు వచ్చి 'ఇది మా నాన్నగారి వస్త్రాలు, ఇవి నీకు సరిపోతాయి; దయచేసి తీసుకొనండి' అని ప్రేమతో యిచ్చాడు! అది చూసి ఆశ్చర్యపడ్డ ఆ నాయకుని గుండె ముక్క చెక్కలయ్యింది!. 'నీ తండ్రిని ఈటెతో చంపేసినది నేనే, నీవు నన్ను తుపాకీతో కాల్చేస్తావను కొన్నాను గాని, నీవు నీ ప్రేమతో నన్ను చంపేసావు' అంటూ తన జీవితమును యేసు ప్రభువుకు అప్పగించి, రక్షించబడ్డాడు.



మనము పగతీర్చుకోవాలి, ప్రతికారము చెయ్యాలి అన్న ఆలోచనలు ప్రభువుకు విడిచిపెట్టాలి!

'పగతీర్చుట నా పని' (హెబ్రీ 10:30)

'కీడును మేలుతో జయించండి' (రోమా 12:21)

1945 వ సంవత్సరం మే 7 న రెండవ ప్రపంచ యుద్ధం ముగిసింది. ఆ యుద్ధం వల్ల దేశాలకు దేశాలు తిరిగి కోలుకోలేనంతగా దెబ్బతిన్నాయి.3 కోట్ల మందికి పైగా ప్రాణాలు పోగొట్టుకొన్నారు అనేక కుటుంబాలు విచ్ఛిన్నమైపోయాయి. ఇంత దారుణానికి కారణమైన నాజీల లొంగుబాటు ఎలా జరిగింది?



జర్మనీలోని ఒక సామాన్యమైన స్కూల్లో, జర్మనీ మిలిటరీ అధికారులు జనరల్ ఐసన్ హోవర్ కు తాము ఓడిపోయినట్లుగా కాగితం మీద వ్రాసిచ్చారు. అంతే, భయంకరమైన యుద్ధం ఆగిపోయింది. జర్మను నాజీల మీద ఎవరూ పగ తీర్చుకోలేదు. యుద్ధంలో చనిపోయిన వాళ్ళందరి పేర్లు చెప్పి, దీనికి మీరే కారణమని వాళ్ళను నిందించనూ లేదు.

క్రైస్తవులమైన మనం ప్రతీకారం చేసే పనిని దేవునికే అప్పగించాలి. "మీకు మీరే పగ తీర్చుకొనక దేవుని ఉగ్రతకు చోటియ్యుడి-పగతీర్చుట నా పని;నేనే ప్రతిఫలము నిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడని."(రోమా 12:1) వ్రాయబడియున్నది.





మర్చిపోకండి."కీడు వలన జయింపబడక మేలుచేత కీడును జయించుము." (రోమా 12:21)

✍️ యన్. జయపాల్

అందరికి:

# రక్షణ వాయిదా వేయకు

ఒకసారి సాతాను తన అనుచరులతో సమావేశమై భూలోకంలో సువార్త ప్రభావం ఎక్కువగా ఉంది! లక్షలాది ప్రజలు యేసుప్రభువును నమ్ముకొనుచున్నారు.బుల్లి సైతానుల్లారా, మీరందరు ఏమి చేస్తున్నారు? వెంటనే సువార్త ప్రకటనను ఆపు చేయడానికి ఏదైనా చేయండి అని గర్జించాడు!

అప్పుడొక దయ్యం లేచి- నేను వెళ్లి బైబిలు వట్టిదని బోధిస్తా అన్నాడు! మరొకడు 'క్రీస్తు దేవుడు కాడని చెప్తా అన్నాడు! ఇంకొకడు యేసును నమ్ము కోవటం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని ప్రకటిస్తా అన్నాడు! ఇలా ప్రతి బుల్లి సైతాను ఏదో ఒకటి చెప్పుకొంటూ పోతుండగా;'నోరు ముయ్యండి'అని సాతానుడు బిగ్గరగా గర్జించి మీరు చెప్పినవన్నీ ఇప్పుడేమీచెల్లవు. మనం చెప్పేవన్నీ అసత్యాలని,క్రీస్తే సత్యవంతుడని ప్రజలకు తెలిసిపోయింది. వేరే మార్గం ఆలోచించండి అన్నాడు.

అప్పుడొక ఘుటిక దురాత్మ నిలబడి అయ్యా! నేను వెళ్లి బైబిలు సత్యవేద గ్రంథమని చెప్తాను;యేసుప్రభువే దేవుడని చెప్తాను. ఆయనే పాపాలు క్షమించగలడని చెప్తాను. ఆయన ద్వారానే పరలోకమని చెప్తాను అని చెప్పుకొంటూ పోతుండగా; ఏంటి నువ్వు చెప్పేది? సువార్తను ఆటంకపరచమంటే నువ్వే సువార్తను ప్రకటిస్తావా? అన్నాడు సాతాను.అందుకు ఆగండి లూసీఫరు,నేను చెప్పేది శాంతంగా వినండి. యేసుప్రభువును గురించి అన్నీ చెప్పాక; యేసుప్రభువును రక్షకునిగా స్వీకరించాలి అన్న విషయాన్ని అందరూ ఒప్పుకొనేటట్లు చేస్తాను గాని, రేపు చూసుకొందామని చెప్తాను లోకాధికారీ అన్నాడు. రేపు రేపు అంటూ వాళ్లు వాయిదాలు వేస్తుండగా; వారిని మన వశం చేసుకొని, నాశనం చేయవచ్చు గదా అన్నాడు. ఆ ఆలోచనకు సభలోని బుల్లి సాతాను లన్నీ కరతాళ ధ్వనులు చేసి భేష్ భేష్ అన్నారు.

నిజంగా ఈ రోజు భూలోకంలో అదే జరుగుతున్నదేమో! మరొక క్రొత్త సంవత్సరం, మరొక క్రొత్త సంవత్సరం అంటూ నీ జీవితంలో అనేక సంవత్సరములు గడిపేస్తున్నా వేమో! అందువలన నీవెన్నో ఆశీర్వాదాలను పోగొట్టుకొంటున్నావు. ఆ తరువాత ఏశావు వలె ఆశీర్వాదం కొరకు ఏడ్చినా రక్షించబడు అవకాశం దొరకదేమో (హెబ్రీ 12:16,17) గనుక "రక్షణ రేపు అని వాయిదా వేయక; ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూ లమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము"(II కొరింథీ 6:2) అని గుర్తించి, ప్రభు వుకు నేడే నిన్ను నీవు సమర్పించుకో!

-✍ యస్. జయపాల్

ఆరు భాషలలో ప్రసారమవుతున్న కల్వరి దర్శనం టివి కార్యక్రమాలకు
మీ సహకారం అందించుటకు
Bank: ICICI Bank
A/c Name: JAYAPAUL FOUNDATIONS
A/c No: 021205006901
IFSC Code: ICIC0000212
Branch: Santhome,Chennai.

# మారని దేవుడు

"యేసుక్రీస్తు నిన్న, నేడు, ఒక్కటే రీతిగా ఉన్నాడు; అవును యుగయుగము లకును ఒక్కటే రీతిగా ఉండును ". (హెబ్రీ 13:8)

యేసుప్రభువు ఇప్పుడే జన్మించినట్టుగా అనేకులు అనుకొంటున్నారు గాని, ఆయన ఆదినుండి ఉన్నవాడు; ఆదియు అంతము నేనే అన్నవాడు (ప్రకటన 3:14; 22:13). "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను" (యోహాను 1:1) అన్న ప్రకారము ఆ వాక్యము అనగా ఆది నుండి ఉన్న యేసుక్రీస్తే శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను (యోహాను 1:14) అని మనం గుర్తించాలి! అప్పుడే నిన్న, నేడు, యుగయుగములు ఏకరీతిగా ఉన్న యేసుప్రభువు యొక్క గొప్ప శక్తిని గ్రహిస్తాం!

సాధారణముగా మన జీవితాల్లో నిన్న ఉన్నట్లుగా ఈవేళ ఉండము, ఈవేళఉన్నట్లుగా రేపు ఉంటామని చెప్పలేము. నిన్న బాగుండొచ్చు, ఈవేళ బాగోలేక పోవచ్చు, రేపు ఎలా ఉంటామో మనకు తెలియదు. నిన్న కష్టాలు పడ్డాము, ఈవేళ సుఖము అనుభవిస్తున్నాము, అయితే రేపేమి జరుగునో చెప్పలేము కదా! (యాకోబు 4:14). గనుక ఎల్లప్పుడూ ప్రభువు చిత్తములో ఉండటం నేర్చుకోవాలి!

ఇదిగో 2026 వ సంవత్సరము గతించిపోతున్నది! కూర్చొని ఆలోచిస్తే ఎన్నో స్థితిగతులను, శోధన పోరాటాలను, సుఖ సంతోషాలను, దీవెన ఆశీర్వాదాలను ఈ సంవత్సరములో అనుభవించియున్నాము. అయితే అన్ని పోరాటాలలో ప్రభువు సహాయం చేసాడు గనుకే నేటివరకు సజీవులుగా ఉన్నాము! ప్రభువు చిత్తమైతే మరో నూతన సంవత్సరములో ప్రవేశించబోతున్నాము! ఇదొక సంతోషకరమైన, ఆశీర్వాదకరమైన సంవత్సరముగా ఉండాలనే ఆశతో "Happy New Year" కొరకు ఎదురుచూస్తున్నాము! పరిస్థితులు ఎలా ఉన్నా, ప్రభువు మనతో ఉంటే చాలు అని నిరీక్షిస్తున్నాము! క్రొత్త సంవత్సరాలు ఆశీర్వాదాలు తేవు గాని, ప్రభువును కలిగినవారు ఎన్నటెన్నటికి ఆశీర్వదించబడతారు! గనుక నిన్న, నేడు, యుగయుగములు ఏకరీతిగా ఉన్న ప్రభువునందు మనము విశ్వాసముంచాలి!

'నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను అని ఆయనయే చెప్పెను గదా. కాబట్టి - ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు? అని మంచి ధైర్యముతో చెప్పగలవారమై యుందాము' (హెబ్రీ 13:5,6). ఆయన ఎన్నడూ విడువడు ఎడబాయడు గనుక "ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను" అన్న మాటను వాగ్దానముగా తీసుకొని, ఈ క్రొత్త సంవత్సరములో ప్రవేశిద్దాం! హల్లెలూయ!

- ఎన్. జయపాల్

# ఇక మీదట నేను



* పౌలు వలే గతించిన వాటిని మరచి ముందుకు కొనసాగుతాను!
* దావీదు వలె సహాయం కొరకు దేవుని వైపు కన్నులెత్తుతాను!
* అబ్రాహాము వలె స్థిర నిశ్చయతతో నా దేవుని యందు విశ్వసిస్తాను!
* హనుకువలె అనుభవము పరలోకపు తండ్రి తో సహవాసం చేస్తాను!
* యోసేపు వలె దౌష్ట్యానికి దూరముగా ఉంటాను!
* గిద్యోను వలె మిత్రుల సంఖ్య తగ్గినా ముందుకు సాగుతాను!
* యోబు వలె అన్ని పరిస్థితుల్లో ఓరిమి వహించి విశ్వాసిగా నిలుస్తాను!
* మోషే వలె తాత్కాలిక పాపపు సుఖాలకై తాపత్రయపడక శ్రమిస్తాను !
* అంద్రేయ వలె నా సహోదరులను క్రీస్తు నొద్దకు నడిపిస్తాను!





## అయ్యో! ఆవు నమిలేసిందే!

నమ్మకంగా దేవుని కివ్వాల్సిన దశమ భాగం తీసి, ఆదివారం కానుక వేయడానికి ప్రక్కనబెట్టింది ఆ మహాతల్లి! ఇంటిల్లో వచ్చాడు, చీరల మూటవాడు. చూడడానికి వెళ్ళి, ఆకుపచ్చ చీరను చూసి, ఆశపడి; దేవునికి తర్వాత ఇవ్వొచ్చులే అనుకొని, ఆ వంద రూపాయలు ఇచ్చి చీర కొనుక్కుంది. చీర ఓసారి కట్టి ఉతికి ఆరబెట్టట అరబెట్టింది.

మద్రాస్సుం (చెన్నై) లో గడ్డి దొరకనందున, గోడల మీద సినిమావాల్ పోస్టర్ కూడా తినే ఆవు ఒకటి ఆ చీరను చూచి; ఆహా! భలే పచ్చగా ఉందని ఆవురావురుమంటూ వచ్చి ఆ పచ్చచీరను అక్కడక్కడా నమిలి వెళ్ళింది. ఎందుకూ పనికిరాకుండా ఉన్న ఆ చీరను చూసి, "అయ్యో! ఈ డబ్బు దేవునికన్నా ఇచ్చాను కావే" అని వాపోయింది ఆ మహాతల్లి!

అవ్వుడు! దేవునిక్కి, దేవునికివ్వకపోతే అదెలాగూ సాతాను ఎత్తుకుపోతాడు. దశమ భాగము దేవుని సొమ్ము! అది దేవుని కివ్వక మోసపుచ్చటము వల్లనో, సాగొట్టికెళపడం వల్లనో నష్టపోతాము (ద్వితీయో 23:21,22). దేవుని కివ్వింది దేవునిక్కి, ఆయన మనల్ని అనేక రెట్లు దీవిస్తాడు!

"నా మందిరములో ఆహారముండునట్లు పదియవ భాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసుకొని రండి. దీనిని చేసి మీరు నన్ను శోధించిన యెడల నేను ఆకాశపు వాకిండ్లు విప్పి, పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించెదనని సైన్యముల కధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు" (మలాకీ 3:10).

- ఎస్. జయపాల్

# మిత్రమా నువ్వు ఫలిస్తున్నావా?

మూడేండ్లు ఫలించక, భూసారమును వ్యర్ధముగా అనుభవిస్తున్న చెట్టును నరికివేయడానికే యజమాని సంకల్పించాడు. అయితే తోటమాలి అడ్డుపడ్డాడు. యజమానిని బ్రతిమాలినాడు. మన జీవితము ఫలరహితముగా ఉండుటను బట్టి దేవుడు బాధపడుతూ ఉండగా; క్రీస్తు ప్రభువు మన పక్షముగా విజ్ఞాపన చేస్తూ, మనము శిక్షార్హులము కాకుండా ఉండడానికి శ్రద్ధ వహిస్తున్నాడు.

మన జీవితంలో మరొక అవకాశమిస్తున్నాడు.ఈ 2027 వ సంవత్సరము దేవుడు మనకివ్వబోతున్న మరో కృపా తరుణం!ఈ సంవత్సరమైనా ఆయన సంకల్పాను సారంగా జీవించాలని, దేవుని కొరకు బహుగా ఫలించాలని కృపాపూర్ణుడైన క్రీస్తు ఆశిస్తున్నాడు.మిత్రమానీవు ఫలిస్తున్నావా? ఫలించకపోతే నీవును నరికివేయబడుదువు సుమా!

లూసీఫరు,కయీను,ఏశావు,సౌలు,గేహజీ,యూదా ఇస్కరియోతుల జీవిత అంతం ఏమైందో జ్ఞాపకం చేసుకొని,బుద్ధి తెచ్చుకోవడం తక్షణ కర్తవ్యం!"ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను"(Iకొరింథీ10:11).ఫలించని ప్రతి చెట్టు నరకబడి,అగ్నిలో పడవేయ బడుతుందని గుర్తించు (మత్తయి3:10).ఫలించని ద్రాక్షచెట్ల విషయము దేవుడు ఏమిచేయ సంకల్పించెనో ఒక్కసారి చదువు (యెషయా 5:5,6).

"ఒకడు కట్టిన పని నిలిచిన యెడల వాడు జీతము పుచ్చుకొనును" (I కొరింథీ 3:14; ప్రకటన 22:12). ఆత్మలను రక్షింపలేని నీ సేవ నిష్ప్రయోజనము. నిన్ను మరింత శిక్షార్హునిగా చేస్తుంది (యాకోబు 3:1).

ప్రియ విశ్వాసీ! నీ జీవిత మెట్లున్నది? ప్రభువు కొరకు ఫలిస్తున్నావా? ప్రియ చదువరీ! నీవు ఆచార సహితమైన జీవితముతోనే తృప్తిచెంది, రక్షణానుభవము లేకుండానే సంవత్సరములు దొర్లిస్తున్నావా? నీవు రక్షింపబడకపోయినచో నరికివేయబడుదువు. మీరు మారుమనస్సు పొందని పక్షమున మీరందరును అలాగే నశింతురు

ప్రియ సువార్తికుడా! ఆకులు గల అంజూరపు చెట్టువై తృప్తిపడుచున్నావా? ఫలభరితమైన,దేవునికి ప్రీతికరమైన సేవను చేయకున్నచో నీవును నీ బహుమానమును పోగొట్టుకొందువని గుర్తించుము! 2027 వ సంవత్సరములో ప్రభువు కొరకు ఫలించగల కృప దేవుడు మనకు అనుగ్రహించును గాక!

- ఎడిటర్


"ఫలించుటకు సహకారి"
ఈ పుస్తకము మీ ఆధ్యాత్మిక పెరుగుదలకు తోడ్పడుతుంది
ఈ పుస్తకమును పొందుటకు కనీస విరాళము రూ:150
GPAY / PHONE PAY: 9100100888

Pray

# July Ministry

Praise

**Revive Us Again, O God! I Know You Will! Give Us A Fresh Start!** Psalms 85:6


















Pray

# July-August-September Ministry

Praise

**Revive Us Again, O God! I Know You Will! Give Us A Fresh Start!** Psalms 85:6









# అబ్రాహాం లింకన్




- అబ్రాహాం లింకన్ ఒక పేద కుటుంబములో జన్మించెను.
- వీధి దీపాల వెలుగులో విద్యాభ్యాసము సాగించెను.
- చిన్న వయస్సులోనే అతని తల్లి అతనికి బైబిలు యిచ్చెను
- బైబిలు చదువుట ద్వారా క్రీస్తును రక్షకునిగా కనుగొనెను.
- పట్టుదల, యథార్థ జీవితమును గురిగా ఉంచుకొనెను.
- తన 22 యేండ్ల వయస్సులో వ్యాపారంలో దెబ్బతిన్నాడు.
- 23 యేండ్ల వయస్సులో ఎలక్షన్లో పోటీ చేసి ఓడిపోయాడు.
- 24 యేండ్ల వయస్సులో మళ్ళీ వ్యాపారంలో దెబ్బతిన్నాడు.
- 25 యేండ్ల వయస్సులో ఎలక్షన్లో ఎన్నికయ్యాడు.
- 26 యేండ్ల వయస్సులో ప్రియురాలు చనిపోయింది.
- 27 యేండ్ల వయస్సులో మానసికంగా కృంగిపోయాడు.
- 28 యేండ్ల వయస్సులో స్పీకరు పదవికి పోటీ చేసి ఓడిపోయాడు.
- 31 యేండ్ల వయస్సులో మరొక పదవికి పోటీ చేసి ఓడిపోయాడు.
- 34 యేండ్ల వయస్సులో పార్లమెంటుకు పోటీ చేసి ఓడిపోయాడు
- 37 యేండ్ల వయస్సులో ఎన్నికయ్యాడు.
- 39 యేండ్ల వయస్సులో మళ్ళీ ఓడిపోయాడు.
- 47 యేండ్ల వయస్సులో ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసి ఓడిపోయాడు.
- 49 యేండ్ల వయస్సులో పార్లమెంటులో ఓడిపోయాడు.
- 51 యేండ్ల వయస్సులో అమెరికా అధ్యక్షునిగా ఎన్నికై అనేక సంవత్సరములు పరిపాలన కొనసాగించెను.
